ఆమె లోలోపల్నుంచి హుషారు తన్నుకొచ్చింది.

"ఏ ఉద్యోగం?"

"ఫ్రీలాన్స్ జర్నలిస్ట్. సంచలన వార్తలని సేకరించి పత్రికకి ఇవ్వటం. ఎప్పుడొస్తావ్?"

"ఇప్పుడే బయల్దేరుతున్నానండీ" అంటూ ఫోన్ పెట్టేసి ఇంటికొచ్చి తయారైంది.

బయల్దేరుతుండగా కుడికన్ను అదిరింది.

ఆమెకి ఇలాంటి వాటిమీద నమ్మకం లేదు. అసలు ఏ కన్ను అదిరితే శుభమో ఏది అదిరితే అశుభమో కూడా తెలీదు.

అరగంట ప్రయాణం చేసి ఆమె పత్రికాఫీసుకి వెళ్ళింది.

కొంచెంసేపు యోగక్షేమాలు మాట్లాడాక "నీకు తిరిగి ఎలాగూ ఉద్యోగం ఇప్పించలేను. ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా పనిచెయ్యి. నీ ఆర్టికల్స్ నెలకు రెండు మూడు వేస్తాను. అయిదారు వందలొచ్చినా మంచిదేగా అన్నాడు" శాస్త్రి.

ఆమె కళ్ళలో నీళ్ళు చిప్పిల్లాయి "థాంక్స్" అంది కృతజ్ఞతగా.

ఆ తరవాత టాపిక్ కొత్త సీరియల్ మీదికి మళ్ళింది.

ఎడిటర్ బల్లమీదే వుంది ఆ స్క్రిప్టు. ఆమె తీసుకుని అక్కడక్కడా చూసింది.

"ఈ నవల రచయిత్రి స్వంత కథలాగే వుంది సర్"

"ఎలా చెప్పగలవు?"

మధూహ నవ్వి "గ్రాఫాలజీ" అంది "ఓత్వాన్ని వెనక్కి తిప్పి వ్రాసేవారు సాధారణంగా జీవితం పట్ల అసంతృప్తులై వుంటారని ఈ మధ్యనే విడుదలైన గ్రాఫాలజీ పుస్తకంలో చదివాను. ఈ స్క్రిప్టులో మొ, వొ, తొ, కొ అన్న అక్షరాలు గమనించండి. గుణింతాలు వెనక్కి తిరిగి వున్నాయి".

"గొప్ప పరిశీలనే! గ్రాఫాలజీతో మనస్తత్వాన్ని ఇంత చక్కగా పట్టుకోవచ్చని నాకు తెలీదు" అన్నాడు శాస్త్రి.

"ఈ రచయిత్రి అడ్రసు ఇవ్వలేదుగా".

"లేదు, ఇష్టం లేదేమో"

"ఇస్తే వెళ్ళి ఇంటర్వ్యూ చేసేదాన్ని".

"ఇంటర్వ్యూ అంటే గుర్తొచ్చింది. టెన్నిస్ ప్లేయర్ ప్రహసిత్ తెలుసుగా".

"విన్నాను. మీరో విషయం గమనించారా? ఈ నవలలో హీరో పేరు కూడా ప్రహసితే ......".

ఎడిటర్ దాని గురించి అంతగా పట్టించుకోలేదు.

" ప్రహసిత్ టెన్నిస్ నుంచి దాదాపు తను విరమించుకున్నట్టే అని ప్రకటించాడు. కారణం మాత్రం ఎవరికీ చెప్పలేదు. అతడిని ఇంటర్వ్యూ చేసి ఆ కారణం పట్టుకోగలిగితే అది సెన్సేషన్ అవుతుంది".

మధూహకి అర్థమైంది. తను విజయవంతంగా ఈ పని పూర్తి చేయగలిగితే జర్నలిస్ట్‌గా గొప్ప విజయం!

ఆమె కుర్చీలోంచి లేచి "ప్రయత్నిస్తాను సర్" అంది.

“ఇప్పటికి లక్షమంది అడిగారు ఆ ప్రశ్న. నేను చెప్పను. అది నా వ్యక్తిగత కారణం” అన్నాడు ప్రహసిత్.

అప్పటికి ఇంటర్వ్యూ ప్రారంభమై అయిదు నిముషాలు గడిచింది.

“కానీ దేశం మొత్తం ఆ కారణం గురించి దిగులు చెందుతోంది”.

“దానికి నేనేం చేయలేను. ఐయామ్ సారీ ...... ”

“ఒక దేశపు గౌరవాన్ని కూడా బలిపెట్టగల పెద్ద కారణం ఏమై వుంటుంది” అంది మధూహ.

అతన్నించి ఎలాగైనా దాన్ని రాబట్టాలన్న ప్రయత్నంతో అతడిని ఇరిటేట్ చేస్తున్నట్టు అడిగింది.

అయితే అతనికి కోపం రాలేదు. “నేను ఆడలేను, పూర్తిగా అశక్తుడిని” అన్నాడు.

“ఆరోగ్యం బావోలేదా?”

“అదేం లేదు”

“బయటకు చెప్పుకోలేని అనారోగ్యం ఏమైనా ...... ”

“అంటే?” మొహం చిట్లిస్తూ అడిగాడు.

“ఎయిడ్స్”

అతడు నవ్వాడు “మీరెంత ఇరిటేట్ చేసినా నేను చెప్పను”.

ఆమె నిస్సహాయంగా చూస్తూండిపోయింది. దిగులేసింది చివరికి అంది "చూడండి, ఈ విషయం ప్రప్రథమంగా నేనే వ్రాస్తేనే ఉద్యోగం దొరుకుతుంది. లేకపోతే రేపట్నుంచి నాకు ఉద్యోగం వుండదు".

అతడామె వివరాలు కనుక్కున్నాడు. "నేనెలాగూ ప్రాక్టీసు పెట్టాలనుకుంటున్నాను. నా దగ్గర రిసెప్షనిస్టుగా చేరుదురుగాన్లెండి" అన్నాడు.

"అంతే కానీ విషయం ఏమిటో చెప్పనంటారు".
"చెప్పను"

ఆమె మౌనంగా కూర్చుండిపోయింది. ఆమె హర్ట్ అయినట్టు గుర్తించి "ఏం పత్రిక అది?" అని అడిగాడు.

మాది అంటూ అందించింది.
అతడు పేజీలు తిప్పుతూంటే 13 ...... 14 ...... 15 అని కనపడింది.

"ఈ పేరేదో గమ్మత్తుగా వుందే"

"స్త్రీ సైకిల్ గురించి"

"ఓ అదా! అయితే మీ ఎడిటర్‌గారేనన్నమాట నాకు ఫోన్ చేసి అడిగింది".

"ఏమని అడిగారు?"

అతడు వివరాలన్నీ చెప్పాడు. ఆమెకు అది చాలా ఆసక్తికరంగా అనిపించింది. అయితే అంతకన్నా ముఖ్యమైనది మరొకటి వుంది. ఈ విధంగా అతడితో మరికొంత సేపు సంభాషణ పొడిగించవచ్చు. ఇంటర్వ్యూలో ఎప్పుడూ అది మంచి పద్ధతి. ఎక్కడో ఒకచోట మనకి కావలసిన విషయం రాబట్టవచ్చు.

"అయితే పిల్లలు కలుగని దంపతుల్ని 13 ...... 14 ...... 15 తేదీల్లో తన దగ్గరికి రమ్మని డాక్టర్ కోరటం తప్పంటారా?" అడిగింది.

“సైంటిఫిక్‌గా తప్పు. మామూలు సైకిల్ వున్న స్త్రీలకయితే తప్పు కాకపోవచ్చు. కానీ జాగ్రత్తగా గమనిస్తే పిల్లలు కలగని చాలా మంది స్త్రీల్లో సైకిల్ నార్మల్‌గా వుండదు. అటువంటి వాళ్ళని 13 14 15 రోజుల్లో రమ్మనటం దారి ఖర్చులు దండగ”.

“సరిగ్గా అండం ఎప్పుడు ఏర్పడుతుంది?”

“అదెవరూ సరిగ్గా చెప్పలేరు. కానీ ఏర్పడిన పదమూడో రోజు మాత్రం బయటకు వెళ్ళిపోవటానికి సిద్ధపడుతుంది” అంటూ బల్లమీదవున్న ఒక కాగితం తీసుకుని చార్ట్‌వేసి “ముప్పై ఆరు రోజుల సైకిల్‌వున్న ఒక స్త్రీని తీసుకుంటే వెనుకనుంచి 13 రోజులు లెఖ్ఖపెట్టాలి. ముందు నుంచి కాదు” అంటూ ఛార్ట్ పూర్తి చేశాడు.

(table)

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 |
| 7 | 8 | 9 | 10 | 11 | 1 2 |
| 13 | 14 | 15 | 16 | 17 | 18 |
| 19 | 20 | 21 | 22 | 23 | 24 |
| 25 | 26 | 27 | 28 | 29 | 30 |
| 31 | 32 | 33 | 34 | 35 | 36 |

“పై రకం స్త్రీని పరీక్ష చెయ్యటానికి ఉత్తమమయిన దినాలు 22, 23, 24 అంతేకానీ 13, 14, 15 కాదు. అంటే 22 రోజు పరిపక్వం చెందిన అండం 35 రోజు వెల్వడిపోతుందన్న మాట”.

“మరి ఈ సంతానోత్పత్తి కేంద్రాల ప్రకటనలు తప్పంటారా?”

“నాకు తెలిసింది ఒక డాక్టర్‌గా చెప్పానంతే”

మధూహ సాలోచనగా కొద్దిసేపు మౌనం వహించింది.

“ఏమిటి ఆలోచిస్తున్నారు?”

"పాపం ఈ రచయిత్రి 13 ...... 14 ...... 15 అని పేరు పెట్టింది. రేపు ఒకవేళ ఈ నవల సూపర్‌హిట్ అయతే విమర్శకులు ఈమె మీద విరుచుకుపడతారు. రంధ్రాన్వేషణ చేస్తారు".

ప్రహి నవ్వాడు. అప్పుడావిడ ఏదో కొత్త థియరీ చెప్పి తనను తాను సమర్థించుకుంటుందిలెండి.

"ఎవరావిడ?"
"లక్ష్మి అని"

లక్ష్మి అన్నపేరు వినగానే అతడి చేతిలో పెన్ను క్రిందపడింది.

"లక్ష్మా" అన్నాడు.

అతడి స్వరంలో ఉద్వేగాన్ని ఆమె సునిశితమైన దృష్టి పట్టుకుంది. అతడిలో సంచలనాన్ని ఆమె గుర్తించింది.

'ఇతడికి నిశ్చయంగా ఎవరో లక్ష్మి అనే ఆవిడతో పరిచయం వుంది అనుకుంది'.

"ఏం వ్రాస్తోంది ఆమె?" అతడి స్వరం కంపించింది. మనిషిలో మార్పొచ్చింది.

అతడినే గమనిస్తూ "చిత్రమేమిటంటే ఆమె సీరియల్‌లో హీరో పేరు ప్రహసిత్" అంది.

అంతే అతడు చప్పున లేచి ఆమె భుజం పట్టుకుని "ఆమె... ఆమె.. అడ్రస్ నాక్కావాలి" అన్నాడు. కాదు. దాదాపు అరిచాడు. ఒక మనిషి అంత ఉద్వేగం చెందటాన్ని చూడటం ఆమెకదే ప్రథమం. భారతదేశానికి చెందిన ప్రముఖ ఆటగాడు ఒక లేడి జర్నలిస్టు భుజం పట్టుకుని అంత ఆవేశం చెందటం ......

ఆమె ఆలోచనలకి క్షణాల్లో రూపకల్పన జరిగింది.

“ఆ... తప్పకుండా ఆమె అడ్రస్ ఇస్తాను” అని ఆగి “మీరెందుకు టెన్నిస్ నుంచి విరమించుకుంటున్నారో చెప్తే” అంది.

అక్కడ శ్మశాన నిశ్శబ్దం.

అతడు ఆలోచించుకోవటానికి సమయమివ్వకుండా మధూహ అంది“ మీకు వేరే విధంగా ఆ అడ్రసు దొరికే అవకాశం లేదు. కేవలం మా పత్రిక వల్లే తెలియాలి కానీ, మీరు మాకు సాయపడని పక్షంలో మేము మీ కెందుకు సాయం చెయాలి?”.

“బెదిరిస్తున్నారా?”

“కాదు, అర్థం చేసుకొమ్మని ప్రాధేయపడుతున్నాను. మీరు ఆట మానెయ్యటానికి కారణం నిజంగా వ్యక్తిగతమై అది ప్రచురించటం ద్వారా మీకు హాని కలుగుతుంది అనుకుంటే, మేం మాత్రం ఎందుకు ప్రచురిస్తాం? మీరే ఆలోచించండి”. ప్రహసిత్ కొంచెం సేపు మౌనంగా వుండి చివరికి అన్నాడు “నేనొక అమ్మాయిని ప్రేమించాను” అన్నాడు.

మధూహ అదిరిపడి “ఆ కారణం వల్ల ఆట మానుకొన్నారా?” అంది.

“అవును”

“ప్రేమకోసం గోడలని దూకిన వారినీ ఉరికంబం ఎక్కిన వారినీ చూసేం గానీ, ఆట మానుకున్న వారిని చూడలేదే” అంది స్వగతంగా. అతడు పట్టించుకోలేదు.

“ఆ అమ్మాయి పేరు లక్ష్మి” అన్నాడు. “అంత మాత్రమే నాకు తెలుసు. ఒకటి రెండు సార్లు నాతో ఫోన్‌లో మాట్లాడింది. ఆమెని ప్రేమిస్తున్నానన్న విషయం చెప్పాను. ఇష్టమో అయిష్టమో చెప్పకుండా ఫోన్ పెట్టేసింది”.

“మీరంటే ఇష్టపడని అమ్మాయిలు కూడా వుంటారా?” చప్పున అనేసి, అతడు ఏమనుకుంటాడో అన్నట్టు చూసింది.

అతడు ఈ లోకంలో లేనట్టే చెప్పుకుపోతున్నాడు ఆ క్షణం అతను చిన్నపిల్లడిలా వున్నాడు.

“అప్పుడే ఆ అమ్మాయితో చెప్పాను. నువ్వు మళ్ళీ ఫోన్ చేయకపోతే నేను ఆడటం మానేస్తానని”.

“ఆమెని ఎన్నిసార్లు చూశారు?”

“ఒకసారి”

మధూహ నవ్వు ఆపుకుంది. “ఒక్కసారి కలిసి ఆమె మిమ్మల్ని ప్రేమించకపోతే దేశం తరపున ఆడటం మానేస్తానన్నారా?” అంది.

“అవును”

“ఒక రకంగా ఇది ఆమెని బ్లాక్ మెయిల్ చేయటం కాదా?“

“నువ్వు నన్ను ప్రేమించకపోతే నేను ఆడటం మానేస్తానంటే అది బ్లాక్‌మెయిల్. నేనలా అనలేదు. నేనంటే ఇష్టమో కాదో చెప్పేవరకూ ఆడనన్నాను”.

“ఒకవేళ ఆ అమ్మాయి ఇష్టం లేదంటే?”

“అప్పుడు కూడా ఆడను. కానీ అందులో ఇక ఆ అమ్మాయి ప్రసక్తి ఏమీ లేదు. కేవలం నా అశక్తత వల్ల ఆడనంతే”.

మధూహ ఆశ్చర్యంగా “అశక్తత ఏమిటి?” అంది.

“ఒకమ్మాయిని ప్రేమించిన మనిషి ఆమె లేకుండా కూడా మామూలుగా ఎలా వుండగలడు? జీవచ్ఛవంలా బ్రతుకుతాడంతే”.

“మీరు ఆ అమ్మాయిని కేవలం ఒకసారి చూశానన్నారు కదూ”.

“అవును”

“ఒకసారి చూసి జీవచ్ఛవం అయిపోతారా?”

ప్రహసిత్ చాలా సేపు ఆమె వైపు సూటిగా చూశాడు. ఆమె ఇబ్బంది పడింది. అంతలో అతనడిగాడు “మీరెవరినయినా ప్రేమించారా?”

మధూహ సమాధానం చెప్పలేదు. రాజు గురించి చెప్పటం ఇష్టం లేకపోయింది అయినా

ప్రహసిత్ ఆ ప్రశ్న ఎందుకు అడిగాడో తెలియలేదు.

“చెప్పండి, మీరెవరినైనా ప్రేమించారా? కనీసం ఎప్పుడైనా ప్రేమలో పడ్డారా?”

“ ...... ”